సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ విభాగం అధికారులు శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారు. చెట్ల కొమ్మల తొలగింపుతోపాటు నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఈ ఫీడర్ పరిధిలో పైనాపిల్‌కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, సీఐడీ కార్యాలయం, కామాక్షినగర్, ఎస్‌ఎస్‌ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, గోల్ఫ్ క్లబ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంవీపీ కాలనీ : తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని సెక్టార్ – 1, కొత్త వెంకోజీపాలెం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

భవిత కేంద్రానికి వితరణ

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డు పరిధి తోటగరువు మండల పరిషత్ పాఠశాలలోని భవిత కేంద్రానికి పీఎం పాలేనికి చెందిన డీఎస్‌ఆర్‌వీఆర్ ఫౌండేషన్ మౌలిక సదుపాయాలు కల్పించింది. ఈ కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉంటారు. వీరి కోసం ఫౌండేషన్ రూ.65 వేలు ఖర్చు చేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులను గురువారం భవిత కేంద్రంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.సత్యవతి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు మహాలక్ష్మి, సలీమా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై బైక్ ర్యాలీ



ర్యాలీలో సీఐ అమ్మినాయుడు, తదితరులు

బీచ్‌రోడ్డు : బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు సూచించారు. రిలయన్స్ జియో ఆధ్వర్యంలో రహదారి భద్రతపై గురువారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. సిరిపురం నుంచి బైక్ ర్యాలీ సాగింది. సడక్ సురక్ష – జీవన్ రక్ష అనే థీమ్‌తో యువతను చైతన్యపరచడంతోపాటు, అవగాహన కల్పిస్తున్నామని జియో అధికారులు తెలిపారు. రహదారి ప్రమాద మరణాలు తగ్గించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ర్యాలీలో ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

నిర్మలాంజలి ఫెస్టివల్ రేపు



కార్యక్రమంలో రామకృష్ణ, తదితరులు

బీచ్‌రోడ్డు : కళాభారతి ఆడిటోరియంలో ఫిబ్రవరి 1న నిర్మలాంజలి ఫెస్టివల్ పేరుతో సహజ యోగ ధ్యానం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కో ఆర్డినేటర్ కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు పెదవాల్తేరు అన్నపూర్ణ కాంప్లెక్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. దూరదర్శన్ ఆర్టిస్ట్ నేహా వర్మ, డాక్టర్ శేష కుమారి మాట్లాడుతూ నగరవాసులంతా పాల్గొని సహజ యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. కార్యక్రమంలో డి.శివ రమేష్, వీవీవీవీ ప్రసాద్, స్వాతి ప్రియ, వర్మ, సుభాషిణి, మీనాక్షి ప్రసాద్ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.26.34 లక్షలు

సీతమ్మధార: సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 37 రోజులకు రూ.26.34 లక్షల నగదు వచ్చింది. అలాగే 214- 800 మిల్లీగ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన 368 యూఎస్ డాలర్లు, 5 సౌదీ రియాల్స్, 1 ఒమన్ రియల్, 12 సింగపూర్ డాలర్లు లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీష తెలిపారు. దేవస్థానం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, శివజ్యోతి, కె.గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

- పెచ్చులూడుతున్న 'డీఆర్‌డీఏ భవనం'
- 2వ అంతస్తులో ఇటీవల ఊడిపడిన సీలింగ్
- ఉద్యోగులకు తప్పిన పెను ప్రమాదం
- సామర్థ్యం కోల్పోతున్న కాంక్రీట్ పిల్లర్స్
- పలు విభాగాల ఉద్యోగుల్లో ఆందోళన



ఎంవీపీ సెక్టార్ - 9లోని డీఆర్‌డీఏ భవనం

క్షణక్షణం భయంభయం



గ్రౌండ్ ఫ్లోర్‌లో కాంక్రీట్ పిల్లర్‌కు పగుళ్లు



గుట్టగా పోసిన సీలింగ్, పాల్ సీలింగ్ వ్యర్థాలు



భవనం 2వ అంతస్తులో ఊడి పడిన సీలింగ్

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 9లోని సంక్షేమ భవన్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇక్కడి ఉద్యోగులు ప్రతీ క్షణం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. నిర్వహణలోపం, నాణ్యత లేమితో భవన సామర్థ్యంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాల కిందట జిల్లా యంత్రాంగం ఈ భవనాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే ఇటీవల 2వ అంతస్తులో సీలింగ్ ఒక్కసారిగా ఊడిపడటం భయాందోళనకు గురిచేసింది. ఎప్పుడూ ఉద్యోగులతో నిండివుండే రూమ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ ఘటన భవన సామర్థ్యంపై మరోసారి చర్చకు తెరలేపింది. దీనికితోడు భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో పలు కాంక్రీట్ పిల్లర్లకు పగుళ్లు ఏర్పడటంతో ఉద్యోగులు సర్వత్రా ఆందోళనకు గురవుతున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనని భయపడుతున్నారు.

7 విభాగాల ఉద్యోగుల సేవలు..

ఇక్కడి సంక్షేమ భవన్‌లో ఆరు నుంచి ఏడు విభాగాలకు చెందిన 150 మంది ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. డీఆర్‌డీఏ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఎస్సీ కార్పొరేషన్, జిల్లా బీసీ కార్పొరేషన్‌తో పాటు జిల్లా స్త్రీ, శిశు సాధికారత శాఖలు ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులతోపాటు ఉద్యోగులు నిత్యం ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిపాలనలో ఇక్కడి సేవలు అత్యంత కీలకంగా మారాయి. వివిధ పనుల నిమిత్తం రోజూ పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల లబ్ధిదారులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఈ భవనంలో నాణ్యతా లోపంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్వహణ చర్యలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు. పెచ్చులూడటం, కాంక్రీట్ పిల్లర్స్‌కు పగుళ్లు ఏర్పడటం వల్ల రానున్న రోజుల్లో భవనానికి మరింత ప్రమాదం పొంచి ఉందని, సమస్య పరిష్కరించే దిశగా ఇంజినీరింగ్ విభాగం మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు. తక్షణ మరమ్మతులతోపాటు తరచూ నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

మహాత్ముని సేవలు చిరస్మరణీయం



మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయబాబు, తదితరులు



మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఆచార్యులు



మాట్లాడుతున్న ఏయూ మాజీ రెక్టార్ ప్రసన్న కుమార్

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం 'మహాత్మా గాంధీ' వర్ధంతి నిర్వహించారు. ఏయూలోని ప్రధాన పరిపాలన భవనం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. సత్యం, అహింసల శక్తి, విలువలను గాంధీ ప్రపంచానికి చాటారని కొనియాడారు. కార్యక్రమంలో గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య కె.సీతామాణిక్యం, ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య నరసింహరావు, ఎంవీఆర్ రాజు, పద్మశ్రీ, నగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విద్య : ఆంధ్రా యూనివర్సిటీలోని గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి గురువారం నిర్వహించారు. సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ జాతికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏయూ మాజీ రెక్టార్, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్ మాట్లాడారు. 'గాంధీ ఫర్ అవర్ టైమ్స్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సమకాలీన జీవన విధానంలో గాంధీజీ చూపిన మార్గాలను కొనియాడారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ సమాజానికి మార్గనిర్దేశం చేయడంలో కీలకమైన గాంధేయ సిద్ధాంతాలు, భావజాలాన్ని యువత, విద్యార్థులు ఆచరించాలని సూచించారు. గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సీతా మాణిక్యం మాట్లాడుతూ భవిష్యత్‌లోనూ గాంధీ ఆదర్శాలు శాశ్వతంగా నిలుస్తాయన్నారు. అనంతరం 'గాంధీయన్ పెర్‌స్పెక్టివ్స్ ఆఫ్ సోషల్ ఛేంజ్ – ఇట్స్ రిలవెన్స్ టుడే' పేరుతో సంకలన సంపుటాన్ని విడుదల చేశారు. ఈ పుస్తకానికి కె.సీతా మాణిక్యం, కనకాల సత్యనారాయణ సంపాదకత్వం వహించారు.

ఎంవీపీ కాలనీ: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వాసవి క్లబ్ ఎంవీపీ కపుల్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6 ఏబీసీ పార్క్‌లోని గాంధీ విగ్రహానికి సంస్థ ప్రతినిధులు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఏవీ రామకృష్ణ మాట్లాడుతూ దేశానికి మహాత్ముడు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన స్ఫూర్తితో సమాజానికి, దేశానికి విలువైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె.వెంకటరమణమూర్తి, పీసీ గుప్త, జి.వాసుదేవమూర్తి, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణా కళాశాలలో ఘనంగా గాంధీ వర్ధంతి

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.క్రిష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపక బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ పోరాటం ప్రపంచాన్ని ఆకర్షించిందన్నారు. జాతి సమగ్రత, ఐక్యతకు గాంధీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు పోల ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి, బి.నాగేశ్వరరావు, యూబీఏ కో ఆర్డినేటర్ ఎస్‌వీ రామారావు, వైఆర్‌సీ కో ఆర్డినేటర్ ఇ.రామక్రిష్ణ, ఆర్‌ఆర్‌సీ కో ఆర్డినేటర్ సాయి క్రిష్ణ పాల్గొన్నారు.

జోన్ – 3 పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ వెల్లడించారు. ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లో గల జోనల్ కార్యాలయంలో అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిమిత్తం కలెక్టర్ గురువారం షెడ్యూల్ విడుదల చేశారని గుర్తు చేశారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని, 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ గడువు ముగుస్తుందన్నారు. ఫిబ్రవరి 27న ఎన్నిక నిర్వహిస్తారని, మార్చి 3న ఓట్లు లెక్కిస్తారని తెలిపారు. జోన్ – 3 పరిధిలోని పోలింగ్ బూత్‌లలో త్వరలోనే ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఓటర్ల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొని స్కూటీ దగ్ధం



ఘటనా స్థలిలో చెలరేగుతున్న మంటలు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ రోడ్డులో ముడసర్లోవ ప్రాంతం రామకృష్ణాపురం కూడలి వద్ద ఓ స్కూటీ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీఆర్‌టీఎస్ రోడ్డులో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ఓ స్కూటీ ఢీకొట్టింది. దీంతో కిందపడిన ద్విచక్ర వాహన చోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. కొంత సేపటికి ఆ ద్విచక్ర వాహనం నుంచి మంటలు చెలరేగాయి. దీంతో ఆ వాహనం పూర్తిగా దగ్ధమైంది.

గాయాలపాలైన ద్విచక్ర వాహనచోదకుడిని కారు యజమాని చికిత్స కోసం విమ్స్‌కు తరలించారు. దీనిపై స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

క్వార్టర్స్‌కు రాజు, సన్యాసి జోడీ

- ఉత్సాహంగా టెన్నిస్ టోర్నీ



పోటీపడుతున్న రాజు-సన్యాసి జోడీ

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ సంఘం(ఐస్టా) టోర్నీలో భాగంగా గురువారం జరిగిన 70+ కేటగిరీలో డీఎస్‌ఎన్ రాజు-సన్యాసిరాజు జోడీ హోరాహోరీ పోరులో విజయం సాధించింది. 9–6తో మల్లికార్జునరావు-బిజిరెడ్డి జోడీపై విజయంతో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. 35+నుంచి 70+వరకు ఐదు కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆఫీసర్స్ క్లబ్‌లో గురువారం 45+సింగిల్స్‌లో జరిగిన నవీన్, బుజ్జిల మధ్య పోరు సమఉజ్జీగా సాగడంతో టైబ్రేక్‌లో 10–8తో నవీన్ విజయం సాధించారు. రమేష్, సంపత్ కుమార్‌లు ప్రత్యర్థులకు ఒక్క పాయింటే ఇచ్చి గెలుపొందారు. వీఎస్ మూర్తి 9–6తో రామకృష్ణపై విజయం సాధించారు. 35+సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో దత్తుపై 2–9తో నగేష్, మరో మ్యాచ్‌లో బాలకృష్ణ 9–0తో మోహన్‌పై గెలుపొందారు. గురువారం మహిళలకు కూడా పోటీలు నిర్వహించగా కవిత, శైలజ, రజనీకుమారి, ప్రియదర్శిని విజయం సాధించారు.

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

తీవ్ర ఇబ్బందులు పడిన సిబ్బంది



చినగదిలి సాయిబాబా ఆలయం వద్ద గోడ కింద ఉన్న పైప్‌లైన్ బాగుచేస్తున్న సిబ్బంది

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో నీటి సరఫరా విభాగం అధికారులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ సమస్యలు పరిష్కరించడానికి జీవీఎంసీ అధికారులు మాత్రం చర్యలు చేపట్టకపోవడం విశేషం. ఈ ప్రాంతంలో నీటి సరఫరా కోసం 1996లో జీవీఎంసీ పైప్‌లైన్ ఏర్పాటు చేసింది. అప్పట్లో నివాసాలు తక్కువ, రోడ్లు చిన్నవి కావడంతో వీలైనంతవరకు పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. వాటి వల్ల ఇప్పుడు తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ పైప్‌లైన్ల పైనుంచి పలుచోట్ల రోడ్లు వేసేశారు. మరికొన్నిచోట్ల నివాసాలు వెలశాయి. ఇంకొన్నిచోట్ల ఇళ్లు, స్థలాలకు ప్రహరీ గోడలు నిర్మించారు. ఆయాచోట్ల ఎక్కడ పైపులు లీకైనా వాటిని బాగుచేయడానికి సిబ్బంది తలలు పట్టుకోవాల్సి వస్తోంది. బుధవారం చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం పక్కన జీవీఎంసీ నీటి సరఫరా పైప్‌లైన్ లీకైంది. దీంతో కొన్ని వేల లీటర్ల తాగునీరు వృథాగా రోడ్డు పాలైంది. ఆ నీటిని కట్టడి చేసి పైప్‌లైన్ బాగు చేయడానికి సిబ్బంది సిద్ధమయ్యారు. లీకైన పైపు ఇక్కడ రోడ్డు పక్కన గోడ కింద నాలుగు అడుగులు లోతులో అమర్చి ఉంది. దీంతో ఆ గోడ భాగంతోపాటు ఫుట్‌పాత్‌ను కొంతమేర తొలగించి బాగుచేయాల్సి వచ్చింది. దీనికి రెండు రోజులపాటు పట్టింది. రోడ్డు మధ్యలోనో, వేరే స్థలంలో అయితే మూడు, నాలుగు గంటల్లో బాగు చేసేవాళ్లమని, ఇప్పుడు గోడ కిందన పైప్‌లైన్ ఉండడంతో మర్మతులకు రెండు రోజులు పట్టిందని సిబ్బంది తెలిపారు. నీటి సరఫరా విభాగం అధికారులు ఇలాంటి పైప్‌లైన్లను గుర్తించి వేరేచోటకు మార్చాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే నీటి వృథా కావడం, దాన్ని బాగుచేయడానకి రోజులు పట్టడం జరుగుతుందన్నారు. మరమ్మతులు చేపట్టినంత సేపూ నీటి సరఫరా ఆగిపోతోందని ఆవేదన చెందుతున్నారు.

భూములు కోల్పోయిన వారికి ఇళ్లు ఇవ్వాలి



రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

ఆరిలోవ : మధురవాడ ప్రాంతంలో కొన్ని కాలనీల నివాసులకు చెందిన భూములను అభివృద్ధి పేరుతో ప్రభుత్వం తీసుకుని, ప్రత్యామ్నాయం చూపకుండా జాప్యం చేయడంపై బాధితులు గురువారం రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, సీఐటీయూ సంఘీభావం తెలిపాయి. భూములు కోల్పోయిన మాకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. నిరసన అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కుల వివక్ష పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యాద్రి పైడితల్లి మాట్లాడుతూ సుమారు 50 ఏళ్ల క్రితం ప్రభుత్వం భూములు ఇచ్చిందన్నారు. ఆ భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా అభివృద్ధి పేరుతో తిరిగి కొన్ని సంవత్సరాల క్రితం తీసుకున్నారన్నారు. దీనిపై ఆందోళన చేపట్టడంతో నష్టపరిహారంగా ఇళ్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకుండా అధికారులు తిప్పుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితులకు ఇళ్లు ఇవ్వకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక దీక్షలు చేపడతామని హెచ్చరించారు. నిరసనలో సీఐటీయూ నాయకుడు డి.అప్పలరాజు, రైతులు ఎస్.సోములమ్మ, అర్జునరావు, బంగార్రాజు, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకర సమాజం



మాట్లాడుతున్న ఆచార్య రామకృష్ణారావు

ఎంవీపీ కాలనీ : పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ సుంకరి రామకృష్ణారావు అన్నారు. ఎంవీపీ కాలనీ సమత డిగ్రీ కళాశాలలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సస్టైనబుల్ రిజీలియన్స్ యూనిట్ (జీవీఎంసీ), గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో సంయుక్తంగా పర్యావరణంపై గురువారం అవగాహన కల్పించాయి. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గమన్నారు. బాధ్యత గల వ్యక్తులుగా వ్యవహరిస్తూ పర్యావరణానికి హాని కలగకుండా వాతావరణాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవాలని సూచించారు. ఆచార్య యూబీ రెడ్డి మాట్లాడుతూ మంచినీటిని ఆదా చేయాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటకుండా ఉండాలంటే అందుకు అవసరమైన కార్యాచరణ అవసరమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ జాతీయ సభ్యుడు ఎంవీవీ మురళీమోహన్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి హాని, గ్రీన్ క్లైమేట్ రత్నం, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడుపై అట్రాసిటీ కేసు పెట్టాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

విశాఖ విద్య : గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుపై అట్రాసిటీ కేసు పెట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ డాక్టర్ తెడబారిక సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్ర యూనివర్సిటీలో గిరిజన నాయకులతో కలిసి నిరసన తెలిపారు. గిరిజనుల హక్కులు, చట్టాలకు వ్యతిరేకంగా ఆదివాసులను అవమానపరిచేలా, మనోభావాలకు భంగం కలిగించేలా అయ్యన్నపాత్రుడు మాట్లాడారన్నారు. స్పీకర్ హోదాలో గిరిజనులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తక్షణమే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాలు జోలికొస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఆదివాసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



ఒక వైపు పెట్రోలింగ్‌కు వాహనాలు లేవని చెబుతున్న పోలీసులు.. ఉన్న వాహనాలకు చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయించకుండా మూలన పడేస్తున్నారు. పోలీసు అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఫొటోయే నిదర్శనం. మద్దిలపాలెం అవుట్ పోస్టు వద్ద మరమ్మతులకు గురైన పోలీస్ పెట్రోలింగ్ బైక్‌ను నెలల తరబడి వదిలేశారు. దానికి రిపేర్ చేయించి వినియోగంలోకి తీసుకురాలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

హెలికాప్టర్ మ్యూజియం పనులు కొలిక్కి



పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, తదితరులు

విశాఖ సిటీ : యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గురువారం బీచ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న హెలికాప్టర్ మ్యూజియంతో పాటు మల్టీ లెవెల్ కార్‌పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. తుది దశకు చేరిన ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ ప్రాజెక్టుల్లో పచ్చదనం పెంపొందించాలని డీఎఫ్ఓ శివానికి సూచించారు. అనంతరం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో అలాట్‌మెంట్, లీగల్, రెవెన్యూ, పరిపాలన విభాగాల పనితీరును సమీక్షించారు. దుకాణాల వద్ద పేరుకుపోయిన అద్దె బకాయిలను తక్షణమే వసూలు చేయాలని.. లేనిపక్షంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు మధుసూధన్, దుర్గాప్రసాద్, రామరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.